# భూ సమస్యలు పరిష్కారమయ్యేనా?

- జిల్లాలో భూభారతి పైలట్ ప్రాజెక్టుగా చిలిపిచెడ్ మండలం ఎంపిక
- మండలంలో భూభారతి దరఖాస్తులు 1043



చిలిపిచేడ్ మండలం గౌతాపూర్ గన్నతండాలో భూ రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఆర్డీవో



చిలిపిచేడ్ మండలం గన్న తండాలో భూ సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులతో గిరిజన రైతులు

మెదక్, మే 25 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలో అసైన్డ్ మెంట్ భూములు, అటవీ భూములు, పార్ట్-బీలో పేర్కొన్న నిషేధిత జాబితాలోని భూములు, టీఎం-33 ఇలా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌లో చాలా వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణి స్థానంలో భూ భారతిని తీసుకొచ్చింది. ఈ చట్టంతో సమస్యలు పరిష్కారమవుతాయని అధికారులు చెబుతున్నారు. రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు సులభంగా అయ్యేలా చట్టం రూపొందించడం, తహసీల్దార్లు, ఆర్డీవోలకు అధికారం కల్పించడంతో సమస్యలు వేగవంతంగా పరిష్కారమయ్యే అవకాశాలు ఉన్నాయి.

### పైలట్ ప్రాజెక్టుగా చిలిపిచెడ్ మండలం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టం మెదక్ జిల్లాలో అమల్లోకి వచ్చింది. పైలట్ ప్రాజెక్టుగా చిలిపిచెడ్ మండలాన్ని ఎంపిక చేశారు. ఇప్పటికే అధికారులు దరఖాస్తులు కూడా స్వీకరించారు. ఆ దరఖాస్తులను పరిశీలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో గత నెల 15 నుంచి 30వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.

### మండలంలో సమస్యలు పరిష్కారమయ్యేనా?

చిలిపిచెడ్ మండలంలో 5736 సర్వే నంబర్లలో 18,077.29 ఎకరాల భూమి ఉంది. మొత్తం 1043 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో మిస్సింగ్ సర్వే నంబర్లు 301, సాదాబైనామాలు 229, భూ విస్తీర్ణం కరెక్షన్లు 148, పేరు మార్పిడులు 122, కోర్టు కేసులు, ఇతర సమస్యలు 153 దరఖాస్తులు వచ్చాయి. ఎక్కువగా సాదాబైనామాలు, మిస్సింగ్ సర్వే నంబర్లు, ఎక్స్‌టెన్షన్ కరెక్షన్లు వచ్చాయి.

### రైతుల్లో పెరుగుతున్న ఆశలు

భూ భారతి చట్టంతో రైతుల్లో ఆశలు పెరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో ధరణి పోర్టల్‌లో భూ సమస్యలను తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో సమస్యలు పరిష్కారమయ్యేవి. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులు తమ సమస్యలను పరిష్కరించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భూ భారతితో అన్ని సమస్యలు పరిష్కారమవుతాయో లేవోనన్న సందేహం కలుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాలో ఒక పైలట్ మండలాన్ని ఎంపిక చేసి భూ సమస్యలను మాత్రమే పరిష్కరిస్తామని చెబుతోంది. ఇందులో భాగంగా మెదక్ జిల్లాలో చిలిపిచెడ్ మండలాన్ని ఎంపిక చేసింది. ఆ మండలంలో 16 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఇప్పటివరకు 1043 దరఖాస్తులు రైతులు చేసుకున్నారు. జిల్లాలో భూ సమస్యలతో పాటు మిస్సింగ్ సర్వే నంబర్లు, ఏరియా కరెక్షన్, డీఎస్ పెండింగ్, నిషేధిత భూములు, అసైన్డ్ భూమి, ల్యాండ్ ఇక్వేషన్, సాదా బైనామాలు, పట్టా ల్యాండ్ గురించి, మెర్జింగ్ ఖాతాలు ఇలా చాలా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి.

**1043 దరఖాస్తులు వచ్చాయి**

భూ భారతిలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన చిలిపిచెడ్ మండలంలో 1043 దరఖాస్తులు స్వీకరించాం. ఇప్పటికే రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి భూ భారతిపై అవగాహన కల్పించాం. దరఖాస్తుల పరిష్కారం కోసం రెండు టీంలు ఏర్పాటు చేశాం. ఇందులో డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్లు ఉంటారు. ప్రస్తుతం టేబుల్ విచారణ కొనసాగుతున్నది.

\- మహిపాల్, ఆర్డీవో నర్సాపూర్

## అందుబాటులో జీలుగ, జనుము విత్తనాలు

**వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వినయ్‌కుమార్**



మెదక్, మే 25 (నమస్తే తెలంగాణ): జిల్లాలో రైతులకు జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి వినయ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలపై డీఏవో మాట్లాడుతూ.. జిల్లాకు15 వేల క్వింటాళ్ల జనుము, 30 వేల క్వింటాల జీలుగు విత్తనాలకు సరఫరాకు ప్రతిపాదనలు పంపించారు. మెదక్ జిల్లాకు 15 వందల క్వింటాల జనము, 5 వేల క్వింటాళ్ల జీలుగు విత్తనాలు ప్రభుత్వం తరపున అందుబాటులో ఉంచామన్నారు. పట్టా పుస్తకం, ఆధార్ కార్డు ఉన్న రైతుకు మాత్రం 50 శాతం వరకు సబ్సిడీపై అందుతుందన్నారు. రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతిలో భూసారాన్ని పెంచేలా చూడాలన్నారు.

## బీటీ రోడ్డు కోసం చెట్ల తొలగింపు



చెట్లు, పొదల తొలగిస్తున్న జేసీబీ

నిజాంపేట, మే 25: నిజాంపేట నుంచి చిన్న నిజాంపేట (సిద్దిపేట) వరకు 2.2 కి.మీ మేర మట్టి రోడ్డు స్థానంలో బీటీ రోడ్డు పనులను ప్రారంభించనున్నారు. ఆదివారం మట్టి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు, పొదలను కాంట్రాక్టర్ జేసీబీతో తొలగింపజేశారు. రూ.2 కోట్ల నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయితే 30 ఏండ్ల కల తీరినట్లే అవుతుందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే హాజరు



రామాయంపేట, మే 25: మండలంలోని గిరిజన తండాలో జరిగిన ఓ పెండ్లి వేడుకలకు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆదివారం మండలంలోని కిషన్ తండా పంచాయతీకి చెందిన ముడావత్ రుక్కి-భున్యా నాయక్‌ల కుమారుడు రవి వివాహం మమతతో కామారెడ్డి జిల్లా యాచారం పంచాయతీ పూర్యానాయక్ గిరిజన తండాలో జరిగింది. కార్యక్రమంలో కిషన్‌నాయక్, దంతెపల్లి గ్రామాల మాజీ సర్పంచ్‌లు సుభాష్ నాయక్, సురేశ్ నాయక్, కాట్రియాల శ్యాములు, బీఆర్ఎస్ నాయకులు బాబుమోహన్, నిఖిల్, మహేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ సన్నిధిలో అన్నదానం


రామాయంపేట, మే 25: రామాయంపేట మండలంలోని డి.ధర్మారం గ్రామంలో ఉన్న పెద్దమ్మ ఆలయం వద్ద ఆదివారం అన్నదానం చేశారు. గ్రామంలో మూడు రోజులుగా పెద్దమ్మ ఆలయంలో మంగళహారతులు, నైవేద్యాలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు అమ్మవారి కల్యాణం నిర్వహించి అన్నదానం చేపట్టారు.

## తునికి నల్ల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

కౌడిపల్లి,మే25: మండలంలోని తునికి గ్రామంలో వెలిసిన తునికి నల్ల పోచమ్మ అమ్మవారిని భక్తులు భారీ సంఖ్యలో ఆదివారం దర్శించుకుకన్నారు. ఒడిబియ్యం, కుంకుమార్చనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం అమ్మవారికి ఆలయ పూజారి శివప్ప, రాజేశ్ పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కలిగించారు. భక్తులు అమ్మవారికి బోనాలు, కానుకలు సమర్పించుకున్నారు. ఆయానికి వచ్చిన భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో రంగారావు, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ హెల్పర్లు, CNC ఆపరేటర్లు, TIG వెల్డర్లు. జీతం: 12,000/- నుండి 30,000/- + PF & ESI, కంపెనీ: S2 ఇంజినీరింగ్ ఇండస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్, ఖాజీపల్లి. సంప్ర: 7075474613.
NT-Prasad
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## అంత్యక్రియలకు కంఠారెడ్డి ఆర్థిక సాయం



నిజాంపేట, మే 25: నస్కల్‌కు చెందిన సత్యం (37) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మృతుడి అంత్యక్రియలకు రూ.5 వేలు బీఆర్ఎస్ నాయకుల ద్వారా బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.

## గొల్పర్తిలో క్రికెట్ పోటీలు



రామాయంపేట, మే 25: రామాయంపేటలోని గొల్పర్తిలో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఆదివారం గ్రామంలోని యువత ఆధ్వర్యంలో మొదటి రోజు క్రికెట్ పోటీలో నాలుగు జట్లు పాల్గొన్నాయి.

## గాయపడిన వ్యక్తి మృతి



అరికెల బూదయ్య (ఫైల్)

చేగుంట, మే 25: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన పోతాన్‌పల్లిలో జరిగింది. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్మడి చేగుంట మండలం పోతాన్‌పల్లి గ్రామానికి చెందిన అరికెల బూదయ్య (57) జీఎంఆర్ హైవేస్ ఆధీనంలో ఎన్‌హెచ్ 44 రోడ్డుకు సంబంధించి కూలి పనిచేస్తున్నాడు. జీఎంఆర్ హైవే వాహనంలో పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో రామంతాపూర్ సోని దాబా వద్ద వాహనం చెట్టుకు ఢీకొన్నది. దీంతో బూదయ్యకు, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆర్‌వీఎం దవాఖానలో చికిత్స పొంది ఈనెల 23న ఇంటికి వచ్చాడు. మరుసటి రోజు మృతి చెందాడు. మృతుడి భార్య పోచమ్మ ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

## ముంజలతో ప్రయోజనాలెన్నో!

- మలబద్ధకాన్ని నివారించే ఔషధ గుణాలు
- వందకు 12 నుంచి 16 ముంజల విక్రయాలు



గంపల్లో తాటిముంజల అమ్మకాలు

రామాయంపేట, మే 25: వేసవిలో మాత్రమే లభించే తాటి ముంజలతో ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. ముంజల్లో ఎన్నో ఔషద గుణాలు ఉంటాయి. ముంజలు తింటే మలబద్ధకాన్ని నివారిస్తుంది. చర్మాన్ని డీహైడ్రేట్ చేసి మరింత అందంగా కనిపించేందుకు సహాయపడతాయని వైద్యులు చెబుతుంటారు. రామాయంపేట పట్టణంలో దూర ప్రాంతాల నుంచి ముంజలు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. వేసవిలోనే లభించే ముంజలకు భలే గిరాకీ ఉంటుంది. చాలా మంది ఇష్టపడి తింటుంటారు. రోజూ పదుల సంఖ్యలో సైకిళ్లపై, గంపల్లో తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. వందకు 12 నుంచి 16 ముంజలు ఇస్తున్నారు. తాటి ముంజల కోసం రామాయంపేటకు వివిధ గ్రామాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తారు. కామారెడ్డి జిల్లాలోనే ఎక్కువగా తాటి చెట్లు ఉన్నాయి. ఇక్కడ నుంచి సైకిళ్లపై వచ్చి ముంజలు రామాయంపేటలో విక్రయిస్తుంటారు.



రామాయంపేటలో సైకిళ్లపై తాటి ముంజల విక్రయాలు

## న్యాయ శిబిరంలో రైతులకు సాయం



సదస్సులో పాల్గొన్న గ్రామస్తులు

పాపన్నపేట, మే 25: పొడ్చెన్‌పల్లి తండాలో ఈ నెల 24, 25 తేదీల్లో భూ భారతి చట్టంపై అవగాహన, ఉచిత న్యాయ సహాయ శిబిరాన్ని నిర్వహించారు. హైకోర్టు న్యాయవాది, మాజీ సర్పంచ్ శ్రీకాంత్ తన సహచర న్యాయవాదుల సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటుచేశారు. భూ భారతి చట్టం, రిజిస్ట్రేషన్, భూమి హక్కులు, కుటుంబ, సివిల్, క్రిమినల్ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పొడ్చన్‌పల్లిలోని సర్వే నెంబరు 1168, కొత్తపల్లిలోని సర్వే నంబరు 342లో దాదాపు వందకు పైగా గిరిజన రైతులు పాత పాసుపుస్తకాలు కలిగి ఉండి, భూములు సాగు చేసుకుంటున్నారు. వారికి కొత్త పాసుపుస్తకాలు ఇవ్వకపోవడంతో వారు రైతు భరోసా, రైతుబీమా వంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందడంలో అనర్హులుగా పరిగణించబడుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తంచేశారు. కొంతమంది బాధితుల సమస్యలను న్యాయవాదులు ప్రోబోనో (ఉచితం)గా స్వీకరించి, వారికి న్యాయపరంగా సహాయం అందిస్తూ పరిష్కార మార్గాలను సూచించారు. శిబిరంలో హైకోర్టు న్యాయవాదులు నల్లపు మణిదీప్, వి.చంద్రకుమార్, బి.గణేష్ తదితరులు పాల్గొన్నారు

## రామాయంపేటలో భారీ వర్షం

రామాయంపేట, మే 25ః రామాయంపేట పట్టణంలోని అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వర్షం సుమారు మూడు గంటల పాటు భారీగా కురిసింది. ఈ వర్షం మూలంగా లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. గుంతలన్నీ నిండి పోయాయి. పట్టణంలోని అక్కల బస్తీ, దుర్గమ్మ బస్తీ, రెడ్డి కాలనీ, టీచర్స్ కాలనీలు జలమయమయ్యాయి. పురపాలిక సిబ్బంది వర్షపు నీటిని ఇతర ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేశారు.

## జాతీయ జెండాలతో తిరంగా బైక్ ర్యాలీ



రామాయంపేట, మే 25: పట్టణంలో తిరంగా బైక్‌ర్యాలీని ఆదివారం పురవీధుల గుండా తీశారు. సిద్దిపేట రోడ్డులో భరత మాత చిత్రపటానికి పూలమాల వేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో భగత్‌సింగ్ ఫౌండేషన్ సభ్యులు శంకర్‌గౌడ్, నరేందర్, సతీశ్, భరత్, గిరి, నాంపల్లి, స్వామి, కార్తిక్, నాగరాలు ఉన్నారు.

## చందాలతో నిరుపేద అంత్యక్రియలు



ఆర్థిక సాయం అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం ఇన్‌సెట్‌లో దుర్గయ్య (ఫైల్)

రామాయంపేట, మే 25: రామాయంపేట పట్టణంలోని ఎస్సీ కాలనీలో నిరుపేద అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. కాలనీకి చెందిన చేపూరి దుర్గయ్య(65) కొన్ని సంవత్సరాలుగా పూరిగుడిసెలోనే ఉండి కుటుంబంతో జీవనం కొనసాగించాడు. రాత్రి వర్షం పడుతుండంతో మృతుడి ఇంటికి వచ్చిన నీటితో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పూరి గుడిసె ముందరే మృతదేహాన్ని వేసి తెల్లవారే వరకు వర్షంలోనే కుటుంబీకులు గడిపారు. మృతుడి కుమారుడు పెయింటర్‌గా పనులు చేస్తుంటారు. దీంతో పెయింటర్ అసోసియేషన్ వారు చందాలు వేసుకుని నగదును అందజేశారు. వారితో బాటు రామాయంపేట సీపీసీఎస్ చైర్మన్ బాదె చంద్రం రూ.2 వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. మృతుడి కుటుంబానికి ఉండడానికి ఇల్లు కూడా లేదని ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని కాలనీ వాసులు పేర్కొన్నారు.

## విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి భిక్షాటన



గొల్లపల్లిలో భిక్షాటన చేస్తున్న ఆలయ నిర్మాణ దాత మల్లేశ్‌గౌడ్

నర్సాపూర్, మే25: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి నూతన ఆలయాన్ని మల్లేశ్‌గౌడ్ నిర్మించారు. ఈ నెల 28వ తేదీ నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహించనున్న సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి నిర్వాహకుడు భిక్షాటన చేశాడు. ఆయనతో పాటు గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడు రాజుగౌడ్, సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, ఆంజనేయులుగౌడ్, ఒగ్గు సత్యనారాయణ, గొల్ల మల్లేశ్, ఒగ్గు ప్రసాద్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?



చిలిపిచెడ్, మే 25: ఇటీవల కురిసిన వర్షాలతో చాలా రోడ్లు దెబ్బతిన్నాయి. మండల కేంద్రం నుంచి శీలాంపల్లి, సోమక్కపేట మీదుగా కౌడిపల్లి డివిజన్‌కు, నర్సాపూర్ వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతున్నది. చిలిపిచెడ్‌కు వచ్చేందుకు సామ్యా తండా, రహీంగూడ తండా, సోమక్కపేట, రాందాస్‌గూడ, గంగిరెడ్డు గూడం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

## విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి

పాపన్నపేట, మే 25: మేతకు వెళ్లిన పాడి గేదె విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన పాపన్నపేట మండలం కుర్తివాడ శివారులో ఆదివారం జరిగింది. పుట్టి వెంకటేశం వ్యవసాయంతో పాటు పాడి గేదెల ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజూ మాదిరిగానే గేదెలను మేతకు తీసుకెళ్లాడు. శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై గేదె మృతిచెందింది. విద్యుత్ అధికారులు, గ్రామ పశువైద్యాధికారి రాకేశ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విద్యుత్ అధికారులు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు వెంకటేశ్ వేడుకున్నాడు.

## సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు వరం

**రూ.5,06,500 చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే



బీఆర్ఎస్ బీసీ సెల్ శివ్వంపేట మండల అధ్యక్షుడు జి.శ్రీనివాస్‌గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి సన్మానించారు.

నర్సాపూర్, మే 25: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని మాదాపూర్ క్యాంపు కార్యాలయంలో నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన నర్సాపూర్, చిలిపిచెడ్, కౌడిపల్లి, కొల్చారం, హత్నూరా మండలాలకు చెందిన బాధిత కుటుంబ సభ్యులకు రూ.5,06,500 విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్రతి పేద కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ మేలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు సంతోష్‌రెడ్డి, సత్యంగౌడ్, సంతోష్ మేఘమాల, బోగశేఖర్, రమణాగౌడ్, సిలివేరు వీరేశం, అరిగే రమేశ్, సంతోష్‌రావు, రవితేజరెడ్డి, సద్దాం, సమీర్, సాకేత్ పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ నాయకుడి మృతికి ఎమ్మెల్యే సంతాపం

పెద్దచింతకుంటకు చెందిన బీఆర్ఎస్ గ్రామ యూత్ ప్రెసిడెంట్ బామనగారి రాజ్‌కుమార్ (35) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆయన అంత్యక్రియల్లో పాల్గొని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ సర్పంచ్ శివకుమార్, మాజీ వైస్ ఎంపీపీ వెంకట నర్సింగరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకుడు సత్యంగౌడ్ పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, (ఇన్‌సెట్‌లో) రాజ్‌కుమార్ (ఫైల్)

## ఏడుపాయల దుర్గమ్మకు జన హారతి



పూజలందుకుంటున్న అమ్మవారు, లైన్‌లో భక్తులు

పాపన్నపేట,మే 25: ఏడుపాయల వనదుర్గా భవానీ మాత క్షేత్రం దుర్గమ్మకు భక్తులు జన హారతి పట్టారు. వేసవి, ఆదివారం సెలవు దినం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో పుణ్యక్షేత్రం కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. వీరు మంజీరా నదిలో వివిధ పాయల్లో పుణ్య స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాలు మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, శ్యాం, బత్తిని రాజు, నర్సింహులు, వరుణాచారి, నరేష్, మహేష్,తదితరులు ఏర్పాట్లు చేశారు. వేద పండితులు శంకరశర్మ, పార్థీవ శర్మ, రాము శర్మ, నాగరాజు శర్మ తదితరులు పూజలు చేశారు. ఏడుపాయల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తమ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు చర్యలు చేపట్టారు.

## సజావుగా గ్రామ పాలన అధికారి పరీక్ష: డీఆర్వో



గ్రామ పరిపాలన పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన డీఆర్వో భుజంగరావు

మెదక్, మే 25 (నమస్తే తెలంగాణ): జిల్లాలో గ్రామ పాలన అధికారి పరీక్ష సజావుగా జరిగిందని డీఆర్వో భుజంగరావు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ, కళాశాలలో గ్రామ పాలన అధికారి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్ష 104 మంది రాయాల్సి ఉండగా 79 మంది హాజరయ్యారన్నారు. పోలీస్ యంత్రాంగం భద్రతా ఏర్పాటు చేశారన్నారు.

## ఆటో ఆకలి కేకల మహాసభను విజయవంతం చేయాలి



మెదక్, మే 25 (నమస్తే తెలంగాణ): రేపు నిర్వహించనున్న ఆటో ఆకలి కేకల మహాసభను విజయవంతం చేయాలని నాన్ పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ జఫీరుద్దీన్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హామీలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ మెదక్‌లో గోడ పత్రికల విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి, ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రేపు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాకేష్ గోస్వామి, మెదక్ టౌన్ అధ్యక్షుడు మహమ్మద్ ముజీబ్, ఖలీల్, అబ్దుల్, మతిన్, రహమత్ అలీ, షాకీర్, రహమత్, మహబూబ్, సాకలి ప్రవీణ్, రాకేశ్, సోహెల్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అల్లాదుర్గం, మే 25: చిల్వెర ఉన్నత పాఠశాలలో 1999-2000లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమ గురువులను సన్మానించారు. 25 ఏండ్లకు కలుసుకోవడంతో చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. హెచ్ఎం ధనుంజయ, టీచర్లు మనోహర్, నర్సింగ్‌రావు, శ్రీధర్, గణపతి పాల్గొన్నారు.